స్కెచ్

# వాఙ్మూలం

కొడవటిగంటి కుటుంబరావు

"ఇతనే పేరుపడ్డ కథకుడు శ్రీరామ్మూర్తి."

"అలాగా? నమస్కారం. మీకథలు చాలా చదివాం."

"నమస్కారం. నా కథలు చదవకుండా ఉండటం కష్టం. పదిసార్లు నా పేరుచూసి తిప్పేసే వాళ్లుకూడా పత్రికలో పదకొండోసారి చూసినప్పుడు, 'పోనీతే ఈ ఒకటీ చదువుదాం' అనుకుంటారు. వెంటబడి తరిమే బిచ్చగాడిలాగా నా కథలు పత్రికలు తిరగేసేవాళ్ళని ఎప్పుడోప్పుడు లొంగదీస్తాయి."

"చాలా విడ్డూరంగా మాట్లాడుతారండీ! మీ కథలకోసం వెతికి చదివేవాళ్లు లేరా?"

"ఏమో! అటువంటివాళ్లుండాలని నా అంతరాత్మలో రహస్యంగా వాంఛించగలను కాని ధైర్యం చేసి ఆశించలేను."

"అబద్ధం. అట్లా ఎవ్వరూ అనుకోరు."

"నాకై నేనూ అనకపోదునేమో. కాని నా క్షేమంకోరినవారూ, నేనంటే ఇష్టంకలవారూ నా కథల్ని విషంచూసినట్టు చూస్తారు. ఎవరైనా దారితప్పి వాటినిగురించి ప్రస్తావించినా నేను భరించలేను."

"ఎందుచేతా?"

"ఎందుకడుగుతారు? తీగ కదిలిస్తే పొదంతా కదులుతుంది."

"నాకేమో అడగాలనివుంది. ముందు నన్నొక సంగతి చెప్పనివ్వండి. మొట్టమొదటసారి మీకథ ఒకటి చదివినప్పుడు నాకొక విచిత్రమైన భావన కలిగింది. కథ బాగున్నదనీ అనిపించలేదు, బాగా లేదనీ అనిపించలేదు. మీలో మీ ఆప్తులుకూడా చెప్పుకోని విషయాలు కొన్ని నాకు చెప్పేశారనిపించింది. ఈ భావం నాకెందుకు కలిగిందో తెలీక మీ కథలు చాలా చదివాను. కొన్ని కథలు మామూలుకథల్లాగే ఉన్నాయి. కాని మిగిలినవి ఇదే భావాన్ని మళ్ళీమళ్ళీ కలిగించసాగాయి. దీనికి కారణమేమిటి? మీరేమన్నా చెప్పగలరా? లేక అది నా భ్రమా?"

"ఇంకోవిషయం ఏదన్నా మాట్లాడదాం."

"మీ యిష్టం... మీ కథల్నిగురించే ఇంకేమన్నా అడగవచ్చా?"

"చెప్పానుగా? నా ఆప్తులెవరూ సాధారణంగా నా కథలజోలికి రారు. మిమ్మల్ని నా ఆప్తవర్గంలో ఉంచుకుందామని అభిలాష."

"మీరు పొరపడుతున్నారేమో. మీ కథలు చదివినకారణంచేత నేను మీ ఆప్తవర్గంలో అదివరకే చేరాను. కనీసం అదే నాకు కలిగినభావం. ఆ భావానికి అర్థమేమిటో తెలుసుకోవటానికే ప్రయత్నిస్తాను."

"నాకు తెలిసేలాగు ఆప్తవర్గంలో ఉండదలిస్తే ఆ కథల ప్రస్తావనే తేవద్దు."

"నాకర్థమయింది. మీ కథల్నిగురించి చర్చించటానికి మీ అణకువ అడ్డొస్తుంది. అవునా?"

"నాకు అణకువ అనే వ్యసనం లేదు. అని కనీసం నా నమ్మకం. కథ రాసేప్పుడు నేను తలవంచుకు రాయను; సర్వజ్ఞుడల్లే రాస్తాను."

"మరి మీ రచనల్ని గురించి మాట్లాడటానికి అంత విముఖత్వం దేనికి?"

"రచయితగా నేను సంఘ శత్రువును."

"మీరా! 'పాంతోషికం' కథ రాసిన మనిషి సంఘ శత్రువా! నమ్మశక్యం కావటంలేదు."

"నేను సరిగాచెప్పలేకపోవటం నా పొరపాటేనేమో. చాలామందికి ఒకటే సంఘం ఉంది. ఆ సంఘంలో ఇష్టులూ, ఇష్టులు కానివారూ ఉండి ఉంటారు. ఇష్టుల లోపాలు క్షమిస్తారు, ఇష్టులు కానివారి సుగుణాలుకూడా పరిగణించరు. నేను-నా కట్లా కాదు. నాకు రెండు సంఘాలున్నాయి. ఒక సంఘం అందరి సంఘంలాంటిదే. అందులో నాకిష్టులున్నారు, కానివారున్నారు. కొందరిని

లక్ష్యపెట్టను, కొందరిని లక్ష్యపెడతాను. లక్ష్యం లేనివారిఎదట నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తాను. లక్ష్యం ఉన్నవారి దగ్గిర చాలాజాగ్రత్తగా ప్రవర్తిస్తాను. ఇది నా కథలతో సంబంధంలేని ప్రపంచం. నా కథలకు సంబంధించిన ప్రపంచం మరోటి ఉంది. అదీ వాస్తవ ప్రపంచమే. కాని అందులో నాకు ఆప్తులులేరు, పరాయివాళ్ళులేరు. నాకు నేనే ఆప్తుణ్ణికాను. ఆ ప్రపంచం గురించి నిజం చెప్తాను. నాకు మొహమాటంలేదు. నేను నిత్యజీవితంలో సహించేవాళ్ళు అందులో నా కలానికి ఆహుతి అయిపోతారు. నా తల్లి, నా అన్నలు, నా భార్య, నా పిల్లలు, నేను —ఎవరిపట్లా నా కక్కడ దయాదాక్షిణ్యాలులేవు. నాకు మహోపకారాలు చేసినవాళ్ళు, నా కృతజ్ఞతకు అపారంగా పాత్రులైనవారు నిశితంగా ఈ రంగంలో గాయపడతారు. నన్ను నేనే ఎన్నోసార్లు తీవ్రంగా గాయపరుచుకున్నాను... ఒక్కొక్కసారి అనుకుంటాను— నేనెందుకీ పనిచెయ్యాలి? ఇతరులందరూ జీవితంతో పొత్తు కలిగిఉన్నప్పుడు నేనెందుకిట్లా దహించుకుపోవాలి? ఈ కథలు మానేస్తాననుకుంటాను. ఒక్కొకసారిఅనిపిస్తుంది- రచయితగా నాకెవ్వరూ తోడులేరు, నేను ఒంటరిగాణ్ణని! ఒక్కసారి కాబోలు నాకు తోడున్నారనిపించింది. అతను విమర్శకుడు. అతనూ కథలు రాస్తాడు. అయితే నాలాగ రాయడు; సున్నితహాస్యంతో ఎవరికీ నొప్పిలేకుండా రాస్తాడు. కాని నా కథలనుగురించి నాతో రెండునిమిషాలే మాట్లాడాడు. అతను వివరంగా చెప్పినదికూడా అట్టేలేదు. కాని అతను నాకు తోడున్నాడనీ, నరకజ్వాలల మధ్యకువచ్చిఅయినా సరే నా రచనలను సమర్థిస్తాడనీ అనిపించింది. ఒక్కక్షణం పాటు అది నా భ్రమేకావచ్చు. మిగతాసమయాలలో రచయితగా నాకు తోడులేరనిపిస్తుంది.

"అయితే ఇదిభ్రమ అని నాకుతెలుసు. నాకు తోడున్నారు. వాళ్లెవరో నాకుతెలీదు. వాళ్ళు నాతో మాట్లాడరు. కాని వాళ్ళతోనేను మాట్లాడతాను—కలంపట్టినప్పుడల్లా వాళ్ళతోటే నేను మాట్లాడేది. వాళ్లు ఎక్కడో ఉన్నవాళ్లుకారు. ప్రపంచంలో వ్యక్తులే, ప్రపంచాన్ని ఎరిగినవాళ్ళే. నా భావాలను అర్థంచేసుకుని సహించగలవాళ్ళే. వాళ్ళకోసమే రాస్తాను. వాళ్ళదగ్గిర నేను బుద్ధిపూర్వకంగా అబద్ధం ఆడలేను. ఎందుకంటే వాళ్ళకు ప్రతినిధి నా అంతరాత్మ."

"మీరచనలో లోపాలమాటేమిటి? మీకున్న ఈ రెండు ప్రపంచాలలో ఎందులో వాటికి స్థానం ఉంటుంది? ఎంతగొప్పగా రాసినా మీ రచనలో లోపాలుండి తీరుతాయని మీరూ ఒప్పుకుంటారుగా?"

"ఒప్పుకోక ఎట్లా? ఇవాళ నేనురాసినకథలో ఎవరూ లోపంపట్టకపోతే రేపునేనే పట్టుకుంటానే! ఆ లోపాలు మామూలు ప్రపంచానికి సంబంధించినవే. వాటిని నా ఇష్టులూ, ఇష్టులు కానివారూ చర్చించవచ్చు! వాళ్ళే చర్చించాలి కూడా."

"ఆ చర్చల పట్ల మీ వైఖరి ఏమిటి?"

"వింటాను, ఒక్కొక్కసారి లాభం పొందుతాను. కాని ఈ విమర్శలు ప్రతిసారీ సవ్యంగా ఉంటాయనుకోవద్దు. నా కథా రచనను నిరుత్సాహపరచాలని యత్నించే వాళ్లున్నారు. వాళ్లునాకు నీచమైన ఆలోచనలూ, ఆశయాలూ ఆపాదిస్తారు. జీవితంలో మరీ సన్నిహితులైతే అస్పష్టంగా తమ అసమ్మతి తెలుపుతారు. దానివల్ల జయించలేక నన్ను తమ మొహమాటంతో జయించాలని చూస్తారు. ఈ ప్రయత్నాలు చేసేటప్పుడు వారు నాకుశత్రువులుగా తోచరు, కాని జీవితానికి శత్రువుల్లే తోస్తారు. నాకు వారిమీద గల ఆదరాన్నీ వారికి జీవితంపట్లుగల శత్రుత్వాన్నీ సమన్వయించలేక బాధపడుతాను. అటువంటి సందర్భాలలో నా స్వార్థంకూడా ఇమిడి వున్నప్పుడు నామీద నాకే ద్వేషం కలుగుతుంది."

"మీరు చెప్పిన రెండు ప్రపంచాలతోనూగల సంబంధాలింత తేడాగా ఉంటే ఈ సంబంధాలు మారకుండా ఎంతకాలం ఉంటాయి? ఒకదాని ప్రభావం హెచ్చుగా ఉండవద్దా?"

"నా సంబంధాలు మారుతున్నాయి. ఒక్కొక్కసారి కథకుడుగా ప్రపంచంతో నాకు గల సంబంధంతో పోలిస్తే జీవితంలోగల సంబంధం అవినీతికరమైనదిగానూ, అసహజమైనదిగానూ, అబద్ధమైనదిగానూ కనిపిస్తుంది. ఒక్కొక్కసారి నా రచనలూ, వాటిద్వారా ప్రపంచంతో

నాకుగల సంబంధమూ నా కల్పనగానూ తోస్తాయి. అటువంటప్పుడు నేను రకరకాల అనుమానాలకు గురిఅవుతాను. నేనేం గొప్ప సత్యాలు కనిపెట్టాను? ఇతరులు గ్రహించలేనిది జీవితంనుంచి నేనేమి గ్రహించాను? నిత్యం నేను చూసే జీవితాన్ని గురించి అందరూ ఎరిగిన సత్యాన్నే చెప్పటానికి నన్ను నేను జరాసంధుడల్లే ఎందుకు చీల్చుకోవాలి? రాయటం కళ అయితే ఆ కళ నాకెందుకు శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వకూడదు? రచన ముగించిన మరుక్షణం నా బుద్ధి ఖాళీ అయిపోయి కొత్త పదార్థంకోసం ఎందుకు అన్వేషణ ప్రారంభించాలి? కొందరు రచయితలు తమ రచనలను గురించి మాట్లాడేప్పుడు తమ పిల్లల్ని గురించి మాట్లాడినంత ఆప్యాయతగా మాట్లాడతారే, ఆపాటి ఆనందం నాకెందుకు లేకపోవాలి? ఈ విధంగా సంకోచాలు కలుగుతాయి. కాని అటువంటి సమయాల్లో ఏ టాల్‌స్టాయ్ ఆత్మో నా చెవిలో బోధిస్తుంది 'మేమూ ఇట్లా బాధపడ్డాం. మేం ఉన్న సత్యమంతా బయటపెట్టనే లేదు. కాని నువ్వు చెప్పే సత్యంలో నీకు ప్రబలంగా నమ్మకం ఉన్ననాడు నీకీ ఘర్షణ తప్పదు. నువ్వు నిత్యజీవిత వ్యవహారాలలో చూపే అబద్ధాన్ని బయటపెట్టటానికే నీకున్న శక్తి యావత్తూ చాలదు. చూడు. ఎంతదూరం పోగలవో పోయి చూడు. ఆ తరవాత జీవితంతో రాజీపడు, నీ పని మరొకరు చేస్తారు. రాజీపడవా? మాలాగే జీవితపు అసత్యంతో పోరాడుతూ నశించు.'"

"మీకూ మీ జీవితానికీ మధ్య సామరస్యం కుదరదంటారా?"

"ఏం సామరస్యం? దగ్గిరస్నేహితులు మనసిచ్చి మాట్లాడుతుంటే వారి మాటల్లో నా చెవు[illegible] జీవితం తాలూకు అబద్ధాలు వినిపిస్తాయి. ఆఖరుకు ఏ స్త్రీ అయినా నన్ను ప్రేమించే దౌర్భాగ్యానికి ఒడిగట్టినప్పటికీ ఆమె ప్రేమలో జీవితపంకిలం స్ఫురిస్తుంది... కాకపోతే ఒక్కటి గమనించాను. జీవితం తాలూకు అవాస్తవికతతో బాధపడనివర్గం నాకు కనిపించింది. అది శ్రామిక వర్గం. ప్రమాదవశాత్తూ నేను ఒకప్పుడు ఆ వర్గం మధ్య పడ్డాను. తాత్కాలికంగా జీవితానికీ నాకూ రాజీ కుదిరినట్టయింది. అట్లా ఎందుకయిందని నేనప్పుడు వితర్కించలేదు. ఆ సమయంలో నేను రాసిన ఒకటి రెండు కథలు పట్టుకుని నన్ను కమ్యూనిస్టన్నారు. అందులో ఏదో ఉన్నదనే భావంతో కమ్యూనిజం, మార్క్సిజం గురించి తెలుసుకోసాగాను. ఇందువల్ల నేను రాజకీయవాదిని అయిపోయినప్పటికీ ఒకటిమాత్రం అర్థమయింది-శ్రామికులతో నాకు పేచీ ఎందుకు లేకపోయిందో."

"చాలా చిత్రంగా ఉంది మీ సంగతి!"

"మైక్రోస్కోప్‌లోంచి చూస్తే బొద్దింక మీసం కూడా ఎంతో విచిత్రంగా ఉంటుంది. అనవసరంగా ఈ ప్రసంగంలోకిదిగాను. నేచెప్పినదంతా మరిచిపోండి. వస్తాను."

"...చూశావుగా తరహా? ఈయనగారు రాసే ముష్టి కథలకు టాల్‌స్టాయితో పోల్చుకుంటున్నాడు."

"........."

"అంతా పోజు! కథపగొప్ప!"

"........."

"వెనక సుమారుగా రాసేవాడు. ఈమధ్య వొట్టి తుక్కురాసి ఆ కాస్త పేరూ పోగొట్టుకుంటున్నాడు."

"........."

"పదేళ్ళయి నేను వీడి కథలు చదవటమే లేదు. ఏదో నువ్వడిగావని పరిచయంచేశాను. బాగా జిడు పట్టించాడు."

"........."

---

తరుణవయస్క అయిన కవిపత్ని భర్తని అడిగింది: "కవిత్వానికీ, వచన రచనకీ తేడా ఏమిటండీ?" అని.

కవిభర్త సమాధానం: "గోదావరి వరదలో నువ్వు కంఠంవరకూ మునిగిపోయావనుకో. అంతవరకూ జరిగినది కేవలం వచనం. అలా అలా నీరు ఎక్కువై అట్టడుక్కి మునిగిపోయావనుకో—అది కవిత్వం!"